స్కెచ్ :

# ★ కలియుగే మిత్రవర్గే! ★

బిలియర్డ్స్ ఆడి క్లబ్ ఆవరణలో దూరంగా కుర్చీలో కూర్చుని యింగ్లీషు జర్నల్ చూస్తున్నాను. క్లబ్ బోయ్ ఆట అయింతర్వాత రోజూ వో కప్పు కాఫీ తెచ్చిస్తాడు. సిప్ చేస్తూ "గాడ్ సేవ్ మి ఫ్రమ్ ఫ్రెండ్స్" అన్న వ్యాసం చదువుతున్నాను.

హలో.... గేమ్ అయిందా. నేను రాకుండానే పూర్తిచేశారే. బైటకుపోతున్నట్లున్నారు చూస్తే!"

అయనకు నన్ను చూస్తే అలా అనిపించినట్లుంది పాపం! విశ్రాంతిగా పేపర్ చూస్తూ కాఫీ త్రాగుతుంటే అలా ఎందుకు అనిపించిందో మరి.

ఏమీ తోచక "ఊఁ...." అన్నాను. ముభావంగా ఆయన ధోరణిమాత్రం చలించలేదు.

"ఓ కే పోయిరండి. నలుగురి మిత్రుల్ని చూచి రావచ్చు. మీకేవండీ.... అదృష్టవంతులు. ఊరి నిండా ఫ్రెండ్స్. కాఫీ నేను లేకుండానే త్రాగేశారు యివ్వాళ. వస్తానండి, విష్ యు గుడ్ లక్"

ఏమిటో ఎందుకో అగమ్యగోచరమై పోయింది నాకు ఊరి నిండా స్నేహితులయితే యీయనకు ఎందుకు యీ హడావిడి. ఆయనా ఆ జాబితాలో వొకడేగదా? ఆయన లేకుండా నేను కాఫీ త్రాగగూడదా? అక్కడకు రోజూ ఆయన నాతోనే త్రాగుతున్నట్లు! ఒక్కసారిగా గాలివాన వెలిసినంత పనయింది. పేపరు అక్కడ పడేసి బయలుదేరాను.

క్లబ్‌లో కలకలం విద్యుద్దీపాల కాంతి విడచి బయటకు వచ్చాను.

"హలో...."

ఎవరా అని తల ఎత్తి చూచాను. ఎదురుగా పళ్ళు యికిలిస్తూ వో పెద్దమనిషి కనిపించాడు. నేనూ యికిలించాను. అప్పుడే వొక స్నేహితుడు కలిశాడు; వెళ్ళిపోయాడు. కొద్దిసేపు ఆలోచిస్తేగాని ఆ మహాశయుడు ఎవరో గుర్తుకు రాలేదు. ఎప్పుడో ఎవరితోనో పరిచయమయితే ఆయన మిత్రుని పక్కన సుంచున్న వో పెద్దమనిషి యీ 'హలో' గారు. ఆశ్చర్యం వేసింది. ఆయన పని చూచుకోక దోవన కనబడ్డ ప్రతివ్యక్తిని "హలో" అంటూ చంపకపోతే వీళ్ళకు పొద్దుపోదేమో! రక్షించాడు; నుంచుని వో గంట ఉపన్యాసం యివ్వలేదు.

రచన:

"హాష్య శ్రీ"

సిగరెట్ ముట్టించాను. ప్రక్కనే ఫుట్‌పాత్‌మీద తలవంచుకు మౌనంగా నడుస్తున్నాను. క్లబ్‌లో ఆయన మాటలు జ్ఞాపకాని కొచ్చాయి. హలో మిత్రుడు మనస్సులో మెదిలాడు. వీళ్ళంతా నాకు స్నేహితులే మరి! క్లబ్ మేట్- క్షమించాలి- క్లబ్ ఫ్రెండ్ గనక ఆ సమయంలో నా ప్రక్కనే వుంటే యీ హలోని కూడా నా మిత్రమండలి జాబితాలో జేర్చి వుండేవాడే. అప్పుడు నా పరపతి సంఖ్య పెరుగుతుంది. నా అదృష్టపు మహావృక్షానికి మరో ఆకు కాస్తుంది.

జీవితంలో వొక్కొక్క రోజే పెరిగిపోతుంది. నాకు పరిచయస్థుల సంఖ్య పెరుగుతున్న రోజులకన్న ఎక్కువై పోతోంది. చిన్న తనంలో చదువుకొనేటప్పుడు వొక్కడే వొక్క జతగాడు వుండేవాడు. వాడూ నేనూ కలసి తిరగని క్షణంలేదు. కాలేజీలో చదివేటప్పుడూ అంతే.... మా యిద్దరికీ స్టూడెంట్స్ "రౌబర్డ్స్" అని పిలిచేవారు. కాలంలో జరిగిన మార్పులవల్ల విధి మా యిద్దర్నీ దూరం జేసింది. పొద్దు పోక క్లబ్‌లో జేరాను. అంతే.... పరిచయస్థుల సంఖ్య పెరిగిపోయింది. సొసైటీ వాళ్ళందర్నీ ఫ్రెండ్స్ అంటుంది. నా వ్యక్తిత్వానికి వాళ్ళ సంఖ్యతో లంకె. ఎంత ఎక్కువ మంది పరిచయస్థులయితే అంత ఎక్కువ అంతస్థు!

ఆలోచిస్తూ సిగరెట్ పూర్తి చేశాను.

"గుడ్ మార్నింగ్ సార్.... ఏదో అర్జంటుగా పోతున్నట్లుంది."

"అలా షికారుకి"

"మంచిది పోయిరండి.... కాఫీ అయిందా"

ఈ మొహమాటం ఎందుకో బోధపడలేదు. నేను అక్కడ మొహమాట పడి వుంటే హోటల్లో నా చేతులో బిల్లు బిద్దలయ్యేవరకూ ఆ జీవనానికి శ్వాసఆడేది గాదు పోయిరండి అన్నవాడికి నా కాఫీతో ప్రసక్తి ఏమిటో మరి! అది తనను త్రాగించమని సొసైటీ తరపున నా స్నేహితుల జాబితాలో వొకడుగా "రిప్రజెంట్" చెయ్యటం కాబోలు!

నాకు కడుపులో కెలికినట్లయింది.

"ఇప్పుడే త్రాగాను.... వస్తానండి"

ఆ జీవం మళ్ళీ అందుకొని సమర్థించుకోవటానికి తంటాలు పడింది.

"ఓహో! వస్తానండి మీ రేదో తొందరగా వెళ్తున్నట్లుంది. ఎవర్నయినా కలుసుకోవాలనుకొంటా!"

అలా వరుసగా అనుకొంటూ పోతున్నాడాయన- నా సమాధానం ఆయన వినిపించుకొన్నట్లే లేదు.

మరో స్నేహితుడు తరలి వెళ్ళిపోయాడు

ఇలా సాగిపోతున్నాను.

చదువు అయిపోయిం తర్వాత నో సంవత్సరం నిరుద్యోగం అనుభవించాను. నరకయాతనాపడ్డాను. మనసు విప్పి మాట్లాడుకోవటానికి వొక్క మిత్రుడయినా దొరికితే బాగుండు అనపించేది.

ఆ రోజులో ఓ మిత్రుడినడిగాను.

"సినిమాకు పోదం రండి; తోచటం లేదు"

ఆయన నిష్కర్షగా సమాధానం చెప్పాడు.

"మీకు తోచటంలేదు సరే- నాకు అవతల తల మునిగే పనుంది"

కాబోలు అనుకొన్నాను; మరోణ్ణి అర్థించాను. వాడు "అబ్బ అంతదూరం నడవద్దూ; పైగా యీ కాలం సినిమాలు తగలేసినట్లున్నాయ్" అన్నాడు.

"రిక్షామీద పోదాం. కాఫీ యిప్పిస్తానుగా" ఆశ పెట్టాను ఆయన నా వంక అదో విధంగా చూచి.

"వస్తానోయ్. అవతల చదువుకోవాల్సింది బోలెడుంది. ఈ టెస్ట్ పాసవకపోతే యీ జీవితానికి యింకా గుమాస్తా బ్రతుకే.... క్షమించు"

వెళ్ళిపోయాడాయన.

ఆయనకు నిరుద్యోగం అంటే అంత హేళన.

ఆయన ఉద్యోగాన్ని నా ముందు అలా బయట పెట్టుకొన్నాడు. ఆయన ఆ రోజు నాతో సినిమాకు వస్తే పాపం? జీవితం అంతా గుమాస్తాగానే బ్రతకాలి. అదే వ్యక్తి మరో రెండు మాసాల తర్వాత బజార్లో కనబడి దూరంగా పోతుంటే పిలిచి,

"మిత్రుడిగా అడుగుతున్నాను. ఎప్పుడూ ఎవరిని అడగలేదు ఆఫీసులో అడగటానికి రోజూ కలిసి పనిచేసేవాళ్ళం, మనస్కరించలేదు ఓ పది రూపాయలుంటే సర్దు. నెలాఖరుకి యిచ్చేస్తాను." అని వాపోయాడు.

నాకు వాంతి వచ్చినట్లయింది.

"చూడండి రావుగారూ, నేను నిరుద్యోగిని. నాకు కనీసం చావకుండా బ్రతకటానికి గుమాస్తా ఉద్యోగమయినా లేదు" అన్నాను.

'సరే లేండి కష్టాలెవరికయినా వస్తాయ్' అంటూ జారుకుపోయాడు.

ఆయన ఆ రోజు పల్కిన దర్పాలు గుర్తుకొచ్చి వుంటాయి. వెళ్ళింతర్వాత బాధ పడ్డాను. ఇస్తే ఎలా గుండేదో!

ఆ తర్వాత పదిరాళ్ళు సంపాదించి పెట్టేవో ఉద్యోగం దొరికింది. మరి కొంత మందితో పరిచయమైంది. నా జీవితంలో నా అంతస్తు యింకొద్దిగా పెరిగిందన్న మాట. ఇంకా ఎంతో పెరగాలి.... పెరిగి తీరుతుంది గూడా!

ఆఫీసులో అందరూ నవ్వుతూ తియ్యగా మాట్లాడుతారు. ఇద్దరు కలిస్తే మూడో వాడు ఆ యిద్దరిమధ్య దోషి

"అబ్బ మూర్తికి విశాల హృదయం లేదోయ్" అంటాడు శర్మ

"ప్చ్! శర్మకి బ్రాడ్ మైండ్ తక్కువ కెరియర్ వుండద్దూ" అంటాడు మూర్తి.

ఆ యిద్దరూ కలిస్తే వారి మధ్య నా బ్రతుకూ అంతే. మేం ముగ్గురం కలిస్తే అలాగే యింకోడి విశాల హృదయం దెబ్బ తింటుంది. ఆ క్షణంవరకూ మేం ముగ్గురం ప్రాణస్నేహితులం.

ఇలా నా స్నేహితుల సంఖ్య రోజు రోజుకీ పెరిగిపోతూనే వుంది. ఆ రోజుల్లో స్నేహితులు అంటే అదో వెట్టితనంగా వుండేది. నాకే గదా యింతమంది తెలుసు అనుకొనేవాణ్ణి! నా వివాహానికి అందరి మిత్రుల్నీ వొక్కర్నిగూడా విడిచి పెట్టకుండా పిలిచాను తీరా వచ్చింది ముగ్గురు, చిన్నతనంలో నాతో బాటు చదువుకొన్న మిత్రుడు. మా ఆఫీసులో వొకాయన. మా యింటి పక్క నున్న జడ్జిగారబ్బాయి. మిగతా వాళ్ళందరికీ ఆ శుభ ముహూర్తంలో ఎన్నో తల మునిగే పన్లుంటాయి. ఆ విషయం ఆ రోజుల్లో అర్థం కాలేదు. అయితే పిలిచి వుండేవాడినే గాదు.

చివరకు మా శ్రీమతిగారి లెక్కలో గూడా నా విలువ మా మిత్రమండలి జాబితానుబట్టే వుంటుంది పెళ్ళయిన కొత్తల్లో సరాసరి యింటికి వచ్చేవాడివి. స్నేహితులంతా నా పరధ్యానానికి కొంచెంనిరుత్సాహపడి దూరదూరంగానే వుండేవారు.

ఓ రోజు శ్రీమతి అడిగింది.

"మీ స్నేహితులు ఎవరూ యింటికి రారేమండీ. బైటకూడా మీరు మన్నుతిన్న పాములానే వుంటారేవిటీ!"

అలా అయిపోయింది నా బ్రతుకు.

మర్నాడు సెంటరో నిల్చుని వలుగుర్ని చప్పట్లుకొట్టి పిలిచి కాఫీలు త్రాగించి, యింటికి తీసుకుపోయి, మా శ్రీమతికి చూపిస్తే నా పురుషత్వం మూడు పువ్వులు ఆరు కాయలు కాస్తుంది!

హాతోస్మి!

అంత పని చేస్తే ఆ మిత్ర బృందం అంతా మరో కొంత కాలం ప్రాణస్నేహితులైపోతారు.

ఆలోచిస్తూ కొద్దిగా జనసమ్మర్దంవుండే సెంటర్‌కు వచ్చాను. అప్రియత్నంగా కొంతమంది స్నేహితులను చేయెత్తి విష్ చేస్తూ, మరి కొంతమందిని చూచి యికిలిస్తూ నడచిపోతున్నాను. ఆ రోడ్డుమీద ప్రధానమంత్రి అమెరికా నగరంలో నడి రోడ్డుమీద యిలాగే పోతాడేమో! అనిపించేది. కాకపోతే ఆయన్ను అక్కడకు పిలుస్తారు. నన్ను యీ రోడ్డుమీదకు పిలవరు. అంతే తేడా!

"ఏకోయ్ ఏమిటి విశేషం. అసలు కనబడ్డమే మానేశావ్?" బజార్లో యింకో యిద్దరు మిత్రులు తగిలారు.

ఏం పనుందా" అన్నాను.

"అబ్బే నీతో నాకేం పనా" వెకిలిగా నవ్వాడు. "చూచి నాలుగు రోజులైనా నాలుగు సంవత్సరాలయి నట్లుందిలే."

(తరువాయి 23వ పేజీలో)

## కలియుగే మిత్రవర్గే!

(10 వ పేజీ తరువాయి)

అందుకని.... యింతకూ యీయన ఎవరో తెలుసా! ప్రఖ్యాత రచయిత "శుక్రతార" గారు అన్నట్టు నీవూ యీ మధ్య కధలేవో వ్రాస్తున్నావట"

శుక్రతారగారు నా వంక చూచి కొంచెం దర్పంగా అన్నారు.

"మిమ్మల్ని గురించి చెప్పాలెండి ఆ మధ్య ఎదో ఒకటి రెండు చూచినట్లుంది"

ఇద్దరూ నన్ను అనుసరించారు. ఇప్పుడు నా ప్రక్కన యిద్దరు మిత్రులు నడుస్తున్నారు. శుక్రతారగారు కవిత్వంమీద ఉపన్యాసం దంచేస్తున్నారు.

"చూశారా మాష్టారూ! చిత్రం ఏమిటంటే యీ కాలంలో కధకులు కరువై పోతున్నారండీ!"

"కరువేమిటండి కో కొల్లలు" అన్నాను

"అది కాదు స్వామీ! మాయిద్దరి స్నేహం అప్పుడే స్వామీలోకి దిగింది.

"వీళ్ళకు ఏం వ్రాయాలో ఎలా వ్రాయాలో తెలియదు. ఎక్కడో మొదలుపెట్టి ఎక్కడో ముగిస్తారు. నాకు మొన్న ప్రైజ్ వచ్చినప్పుడు చూశారా మాష్టారూ, ఓ మహాకవి అనుకొనే ఆయన ఉపన్యాసం యిచ్చి చంపాడు. "నీ బ్రతుకు వర్ధించిన విస్తరిల్లాంటిదోయ్...అంటూ మొదలుపెట్టి ప్రైజు కొట్టేశావులే ఫో!" అన్నాడు. నాకు ప్రయిజు రావటం ఆయనకు అలావుంది. ఆయన కాపీ కొట్టి వ్రాసిన కధలు నేను చదవలేదని ఆయన వుద్దేశ్యం! అమాట కొస్తే అసలు యింగ్లీషు గుణించుకోవటమే గాని చదవటంరాదు మాష్టారూ! ఆయన పేరెందుకులెండి. అయనా వో ప్రఖ్యాత రచయితే!"

ఇలా ఉపన్యాసం దంచేస్తున్నాడాయన. అయన్ను యివ్వన్నీ చెప్పమని నేను అడగనూలేదు. వింటానికయినా అంత ఉత్సాహం చూపించటంలేదు. ఆయన ధోరణీ ఆయనది. నా ప్రాణాన్ని గురించి కొద్దిగా అయినా ఆలోచించే పరిస్థితిలో లేడాయన. ముఖావంగా నడుస్తుంటే పక్కనున్న స్నేహితుడన్నాడు.

"ఏరా బాబూ శుక్రతారగారు అలా మాట్లాడుతుంటే నీవు మాట్లాడ వేంరా? రెండు కధలు వ్రాయంగానే నీకు తలబిరుసెక్కినట్లుందే! పద కాఫీ త్రాగుదాం"

శుక్రతారగారు దాన్ని బలపరచారు

"ఇప్పుడే తాగాను మీరు వెళ్ళిరాండి"

"రావోయ్ బిల్ నీ కివ్వంలే"

అలా నా ప్రాణానికి కాఫీ బిల్ రూ లంకెకట్టి హోటల్లోకి దోవ తీశాడు. ఆ మాట అనిపించుకొనికూడా బిల్ యివ్వకపోతే బాగుండదని "నేను యిస్తాను యివ్వు" అని దాన్ని తీసుకోబోయాను.

"నీ కెందుకురా.... తాగు" అన్నాడే గాని దాన్ని ముట్టుకోలేదు అది నేను తీసుకోబోతే తనూ తీసుకోబోయి చింపాడు. బిల్లు మాత్రం నా చేతికే ఎక్కువ భాగం మిగిల్చాడు అక్కడి కదియింది. శుక్రతారగారు మాత్రం మా వంక చూస్తూ నవ్వుతూ కూర్చున్నాడు.

వాళ్ళిద్దర్నీ వొదిలించుకొని పెద్ద బజార్లోకి జేరాను

"హల్లో ఎందాకా" మరో మిత్రుడు.

"కులాసా" ఇంకో ఆయన

"క్షేమమా" మరో మిత్రుడు.

"సారీ.... మొన్న మళ్ళీ కలుస్తానని మర్చేపోయానండి. బిజీ ప్రోగ్రామ్" ఆయన నా మిత్రమండలి జాబితాలో మెంబర్ టూ.

"పార్టీ ఏది బ్రదర్.... మూడు నెల్ల నుంచీ ఆశపెడ్తున్నావ్." ఈ మిత్రుడికి ఎందుకో పార్టీ కావల్సి కనిపించినప్పుడల్లా యిదే గొడవ.

ఇంతమందినీ అభిమన్యుడు పద్మవ్యూహం చేధించినట్లు ఛేదించుకొంటూ ఆ బజారు దాటాను.

ఊరు బయటకు జేరాను. ఇంకా వీళ్ళంతా నా మనస్సులో మెదుల్తూనే వున్నారు. నడిరోడ్డుమీద నడుస్తూవుంటే వెనకనుంచి చప్పట్లు వినిపిస్తున్నాయి. గుండె వొక్కసారి ఆగిపోయినట్లయ్యేది. ఈ చప్పట్లు కొట్టి పిలవడం అంత అనాగరికత మరొకటి వుండదేమో!

ఈ నాగరికుల్లో వొకరిమీద వొకరికి నమ్మకం వుండదు. కనబడ్డప్పుడు ఎంతో ఆత్మీయంగా మాట్లాడుకొంటారు ఈ నటన చదువుకొన్న వాడికి ఎక్కువ అనుభవంలో వుంటుంది. ఈ ప్రపంచంలో పరమాణు స్వరూపంలో సహస్రాంశమయినాలేని మానవ జీవన కాలంలో యిన్ని మోసాలు. కృత్రిమాలు ఎందుకు ముదిరిపోయాయో! మనస్ఫూర్తిగా వింపు హృదయంతో ఆ కొద్ది కాలాన్నీ వీళ్ళు స్వర్గతుల్యం చేసుకోరు. ఒకవేళ ఎవరయినా అలా వుండాలనుకొన్నా ప్రపంచిక దృష్ట్యా వాడు ఏమీ తెలియని పసికుంక కాకపోతే అన్నీ తెలిసిన ఉన్మాది!

అంతా కృతకం! ద్రోహం!!

విసుగుతో మనస్సంతా విషపూరితమైపోయింది. ఈ కృత్రిమ వాతావరణం దాటి దూరంగా నిశ్శబ్దంగా కాలవ ప్రక్కనే నడచిపోతున్నాను. దూరంగా తాటిచెట్లు ఆ ప్రక్కనే శ్మశానం.

హటాత్తుగా ఎవరో పిలిచినట్లయి ఎవరా అని వెనక్కు తిరిగిచూచాను. మరో యిద్దరు మిత్రులు నా కోసం సైకిలుమీద వస్తున్నారు బెల్ కొట్టుకుంటూ. ఊరు విడిచి దూరంగా పోతున్నా వీళ్ళు పసికట్టి వెంటబడ్డారు. ఒక్కసారి కోపం ముంచుకొచ్చింది.

కానీ ఎలా?! మొహం ముడతలు పడింది. మౌనంగా నుంచున్నాను. ఆ యిద్దరూ సైకిలు దిగారు.

ఏదో కొంప మునిగేటట్లు, నేనేదో పెద్ద నేరం చేసినట్లుగా నా వంక చూస్తూ అన్నాడు అందులో వొకడు.

"ఏరా ఎంతమందితో ఎన్ని విధాలుగా చెప్తావు. నీ కోసం గంటనుంచీ వెతుకుతున్నాం. నీవు మునుపటి వాడివి కాదు లేరా! నీ మిత్రులు ముగ్గురు కనిపించారు. ఒకాయన నీవేదో అర్జంటుగా పనిమీద పోతున్నావన్నాడు. ఇంకొకాయన ఎవరికో సీరియస్‌గా వుంటే పోతున్నావన్నాడు. మరో ఆయన షికారుకు బయల్దేరావన్నాడు.

ఏది నమ్మాలాఁ. ఏవిటాఁ యిది!!

వరుసగా నన్ను అలా దుయ్యబట్టేస్తున్నాడు. నా విషయం ఆలోచించటంలేదు. ఇది ఎంతవరకు నిజమో అలా వాళ్ళు ఎందుకు చెప్పారో ఆలోచించడు. అయన అహంకారం ఆయనది. ప్రక్కనున్న మరో మిత్రుడు మాట్లాడకుండా నుంచున్నాడు. ఆ మిత్రుడు నాతో వొకప్పుడు ఎంతో ఆత్మీయంగా తిరిగేవాడు.

అర్ధరాత్రి మూడు గంటలవరకూ నా పక్కలో పడుకొని కబుర్లు చెప్పేవాడు. నా మిత్రత్వంలో పరవశించినట్లుగా మాట్లాడేవాడు. దేశం అంతా నన్ను మరచిపోయినా తను మాత్రం మరచిపోలేనని ప్రమాణాలు చేశాడు.

ఆయనకు నాతో పనయిపోయింది- అంతే!

ఈ రోజు ఆ మహాశయుడికి కనీసం నా వంక చూచి మాట్లాడటానికయినా మనస్కరించటంలేదు. మనుష్యులు అసత్యాల్ని, అపార్థాల్ని ఎందుకు యింత వేగంగా విశ్వసిస్తారో! మనిషిమీద మనిషికి కనీసం నమ్మకం ఎందుకు సడలిపోతోంది?!

అసహ్యం వేసింది.

"ఇంతకూ మీరు నా కోసం తిరుగుతున్న పనేమేటి?" ఆ మిత్రశ్రీ మొదలు పెట్టాడు- అంతా మరచిపోయి ఆత్మీయతనంతా చిరునవ్వులో వెళ్ళకక్కుతూ అన్నాడు.

"మిస్టర్! మేం పెద్ద ఉద్యమంలో తిరుగుతున్నాం. మనరావ్ గుర్తుందిగదూ- చాలా కష్టాల్లో వున్నాడు. వాడికి మనం సహాయం చెయ్యకపోతే వాడి కుటుంబం అంతా ఆత్మహత్య చేసుకోవల్సిందే. నీవు యివ్వాళ అతనికి సహకరించకపోతే వాళ్ళ పొయ్యిలో పిల్లి లేవదు. నీవు దానం చెయ్యనక్కర్లేదు. తిరిగి నెలాఖరుకి వాడి జీతం రాగానే సర్దేస్తాడు"

ఆ రావు గారికీ తనకీ మధ్య యీమధ్య వర్తిత్వం యిది మొదటిదిగాదు. ఇలా రెండు నెలలూ, రెండు జీతాలు దాటిపోయాయి. పైగా యిదంతా ఏదో ఉద్యమం అంటూ ఆత్మ ద్రోహం చేసుకొంటున్నాడు.

నాకు నవ్వు వచ్చింది.

"బ్రదర్! అంత పెద్ద ఉద్యమాలు అంటే నాకు సరిపడదు, పైగా నేను అంతటి తాహతు గల వాణ్ణిగూడా గాదు

"ఇలా అయిపోతావనుకోలేదు. ఆపదలో ఆదుకోనివాడివి నీవూ వో స్నేహితుడివేనా.... ఛీ!" అన్నాడు, ఎంతో తేలిగ్గా.

వొళ్ళు మండిపోయింది నాకు.

"పోనీ నువ్వు యివ్వచ్చుగా" అన్నాను కోపంగా.

"కొద్దో గొప్పో వున్న నువ్వే అలా అంటావనీ, ఏదో గుమాస్తాగా బ్రతుకుతున్న నన్ను యివ్వమంటావని అర్థమవుతే ఆ పనే చేసి వుండేవాడిని" అంటూ యిద్దరూ దూసుకు వెళ్ళిపోయారు.

ఇలా పూర్వం వో సారి డబ్బు తీసుకొని యీ మిత్ర మహాశయుడే వాడుకొన్నాడు. ఆ రోజు సినిమాకుపోతే అక్కడ అగుపించాడు వీడు ఎవత్తెతోనో.... ఛీ!

పైగా యిదంతా ఉద్య[illegible]ంట [illegible]లాటి బ్రతుకు బ్రతకటానికి స్నేహితునిగా నేను సహాయపడాలట.

కాలవ ప్రక్కనే ఎవరికీ కనబడకుండా పడుకొన్నాను. ప్రశాంతమయిన వాతావరణంలో పక్షుల కలవరాలు అస్తమిస్తున్న సూర్యభగవానునికి వీడ్కోలు చెప్పుతున్నాయి.

నేను ఒక్కసారిగా ఎన్నో సంవత్సరాలు వెనక్కు పోయాను.

ఆ రోజుల్లో నేను మా మిత్రుడితో యిక్కడికే వచ్చేవాడిని. ఆ మిత్రుడు ప్రతి సాయం సంధ్యలోనూ మా యింటి ముందునుంచి కేకపెట్టితే, ఆకేక నాహృదయం వరకూ వినిపించేది. ఆతని పెద్ద పెద్ద కళ్ళ ఎదుట సర్వం మరచి పోయే వాడిని. ఇద్దరం చేతులు పట్టుకు మౌనంగా యింత దూరం నడచివచ్చి యిక్కడే కూర్చుని పక్షుల కలరవాలు వినేవాళ్ళం. మా మధ్య మాటలు మౌనాన్ని అనుభవించేవి. ఆ పక్షుల గీతాల్లో ఏదో సంగీతం వినిపించేది. ఇద్దరమూ వొకటైపోయి ఏదో మైత్రి పథంలో నడచి యింటికిపోయేవారం.

అలా ఎంతసేపో అక్కడ మధుర స్మృతులు నాదృష్టి పథంలో నిల్చి ఆర్తిని కలిగించాయి.

ఇప్పుడు కనీసం మనస్ఫూర్తిగా, ఆర్తిగా ఆత్మీయంగా మాట్లాడటానికి ఎవరూ లేరు. అలా అనుకోవటం నిజంగా పసితనమా? కాకపోతే ఉన్మాదమా? అలాగయితే యీ మమతలకు అనురాగాలకూ అర్థం ఏవిటి? తనకు ఎదురుగా కనిపించే ప్రపంచ అంతా ఎలా యింత సంతోషంగా వుంటోంది? నిజానికి ప్రతి చిన్న విషయానికీ వో నిర్వచనం ఆపాదించి, ఆశయాలకోసం పాటుపడితే యింతేనేమో!

ఆ ఆశయాలు వొట్టిభ్రమలా? తప్పకుండా కాదు!

అలాటి అర్థంలేని ఆలోచనల్తో ఎంతో సేపు అక్కడ కూర్చున్నాను. మసకచీకటి పడుతోంది. లేచి యింటికే బయలుదేరాను.

అప్పటికే ఆలశ్యంగావచ్చి సాయం సంధ్య చేసుకొంటూ ప్రక్కకాలవ వొడ్డునే వున్న వో ముసలి నైష్ఠికుని కంఠ స్వరం వినిపించింది లీలగా....

కలియుగే.... భరతవర్షే....

నాకు నవ్వు వచ్చింది.

నా క్లబ్ ఫ్రెండు నా ప్రక్కనే వుండి వుంటే 'అనుభవించటానికికూడా అదృష్టం కావాలి బ్రదర్' అని వుండే వాడు.

———:0:———